నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రణభేరి

- రాయలం నుంచి భీమవరం వరకు భారీ ర్యాలీ
- ఎక్సైజ్ సీఐ బలరామరాజుకు వినతిపత్రం అందజేత



నకిలీ మద్యం నిందితులను కఠినంగా శిక్షించాలని ఎక్సైజ్ సీఐ బలరామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న చినమిల్లి వెంకటరాయుడు తదితరులు

భీమవరం: నకిలీ మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై భీమవరం నియోజకవర్గంలో నిరసన వెల్లువెత్తింది. సంపద సృష్టిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీల నాయకులు నకిలీ మద్యాన్ని ఏరులైపారిస్తూ తమ సంపదను పెంచుకుంటున్నారని దుమ్మెత్తిపోశారు. నకిలీ మద్యం విక్రయాలను అరికట్టాలని, మద్యం బెల్ట్‌షాపులను అరికట్టాలంటూ మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు అనుహ్యస్పందన లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాయలం గ్రామంలోని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు నివాసం వద్ద నుంచి పెద్ద ఎత్తున మోటారుసైకిల్ ర్యాలీగా బయలుదేరి భీమవరం టూటౌన్‌లోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబట్టుకుని నకిలీ మద్యం తయారీ, విక్రయాలను ప్రోత్సహిస్తున్న కూటమి నాయకుల వైఖరిని నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఊరు, వాడ మద్యం బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి పేదల జేబులు గుల్లచేయడమేగాక నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు అందిస్తామని ఎన్నికల్లో గొప్పలు చెప్పిన నారా చంద్రబాబునాయుడు విచ్చల విడిగా బెల్ట్‌షాపుల్లో కల్తీ మద్యం విక్రయాలతో మద్యపాన ప్రియులను ఆసుపత్రుల పాలుచేస్తున్నారని విరుచుకుపడ్డారు. యథేచ్ఛగా సాగుతున్న నకిలీ మద్యాన్ని పాపులర్ బ్రాండ్లను తలపించేలా బాటిళ్లపై నకిలీ లేబుల్స్ అంటించి సరఫరా చేస్తున్నారంటే ప్రభుత్వ పెద్దల సహకారంతోనే జరుగుతోందని దుమ్మెత్తిపోస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించి ప్రత్యేక సమయాల్లోనే అమ్మకాలు చేయగా నేడు వేళాపాళా లేకుండా మద్యం విక్రయాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిన కూటమినాయకులు నేడు ఇంటికో మద్యం బెల్ట్‌షాపు ఏర్పాటు చేయించి పేదల రక్తమాంసాలతో వ్యాపారం చేస్తున్న ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్‌శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె బలరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, పార్టీ భీమవరం పట్టణం, వీరవాసరం మండల అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, చవాకుల సత్యనారాయణ, చిగురుపాటి సందీప్, పాలవెల్లి మంగ, అల్లూరి రవిరాజు, గంటా సుందరకుమార్, వీరవల్లి శ్రీనివాసరావు, గుంటి ప్రభు, పెనుమాల నర్సింహస్వామి, స్టాలిన్‌రాజు, యరకరాజు ఉమాశంకర్, మునగాల నర్సింహమూర్తి, డీవీడీ ప్రసాద్, కడలి శ్రీరాములు, వీరవల్లి ప్రవీణ్, రాయవరపు శ్రీనివాసరావు, తాళ్లపూడి పరమేశ్వరరావు, ముదునూరి సుబ్బరాజు, చినమిల్లి బాబి, కేతా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐతో విచారణ జరిపించాలి



రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు. నకిలీ మద్యం తయారీ, విక్రయాలపై సీబీఐ విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. సిట్‌తో తూతూమంత్రంగా విచారణ జరిపించి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడడం దారుణం. నిందితులను శిక్షించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తే వైఎస్సార్ సీపీ ఆందోళన మరింత ఉధృతం చేస్తుందన్నారు.

–చినమిల్లి వెంకటరాయుడు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, భీమవరం

నకిలీ మద్యం తయారీలో పెద్దల హస్తం



కూటమి ప్రభుత్వ హయాంలో మద్యం బెల్ట్ షాపులు విచ్చల విడిగా ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే నకిలీ మద్యం వ్యాపారం జోరందుకుంది. ప్రభుత్వం పెద్దల కనుసన్నల్లోనే నకిలీ దందా జరగడం వల్లనే 16 నెలలుగా మారుమూల ప్రాంతాలకు నకిలీ మద్యం సరఫరా విస్తరించింది. ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

–కామన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, భీమవరం

మహిళలకు రక్షణ లేకుండా పోయింది



కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. విచ్చలవిడిగా మద్యం విక్రయాలతో మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. సంపద సృష్టిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ పెద్దల సంపద సృష్టికే నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కనబడుతోంది. తక్కువ ధరకు నాణ్యమైన మద్యం అంటూ అందలమెక్కి నకిలీ మద్యంతో పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రజలంతా తిరగబడి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారు.

–పాలమెల్లి మంగ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ

నకిలీ మద్యంపై నేడు ధర్నా

ఆకివీడు: నకిలీ మద్యం విక్రయాలపై ఈ నెల 15వ తేదీన స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరగాల్సిన కార్యక్రమం వర్షం వల్ల వాయిదా పడిన విషయం విధితమే. నకిలీ మద్యం తాగి అమాయకులైన మద్యం ప్రియులు చనిపోతున్నారని, దీనిపై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధర్నాకు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పీవీఎల్.నర్సింహరాజు ముఖ్యఅతిధిగా పాల్గొంటారని, పట్టణంలోని వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు ఉండిలో కోటిసంతకాల కార్యక్రమం

ఉండి: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఉద్యమంలో భాగంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల కార్యక్రమాన్ని బుధవారం ఉండి రాజులపేటలో ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు హాజరవుతున్నారని మండల పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భీమవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు



తుందుర్రులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చినమిల్లి వెంకటరాయుడు

భీమవరం అర్బన్: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి, కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త చినమిల్లి వెంకటరాయుడు అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు, జొన్నలగరువు, బేతపూడి గ్రామాల్లో మంగళవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలంటూ కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయ కర్త చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం సరికాదన్నారు. భవిష్యత్తులో పేదోళ్లు వైద్యం చేయించుకోవాలంటే లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఈ విధానానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో తమ సంతకాన్ని చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే సరైన బుద్ధిచెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతపూడి, తుందుర్రు, జొన్నలగరువు గ్రామ కమిటీ అధ్యక్షుడు పాలపర్తి అర్జున్ రెడ్డి, బుంగా ప్రహ్లాదుడు, వర్దనపు శ్రీను, జవ్వాది సత్యనారాయణ, కొట్ట ప్రసాద్, నన్నేటి నరేంద్ర, సోడదాసి మాణిక్యాలరావు, నక్కా కుమార్ రత్నం, విప్పర్తి పుల్లయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవనోపాధుల కల్పనకు మెప్మా అధికారులు కృషి చేయాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తునర్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ప్రజలకు మెరుగైన జీవనోపాధుల కల్పనకు మెప్మా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు ×మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్¤ గోడపత్రికను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు వివిధ వ్యాపారాల స్థాపనకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయించుకునేందుకు ×మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్¤ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక కుటుంబం, ఒక వ్యాపార వేత్త అనే నినాదంతో 51 రకాల వ్యాపార యూనిట్లకు సంబంధించిన బ్రోచర్‌ను రూపొందించడం జరిగిందన్నారు. బ్రోచర్లను పట్టణ ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. వ్యాపారం చేయుటకు ఆశక్తి గలవారు ఆన్‌లైన్‌లో సులువుగా దరఖాస్తు చేసుకుని, ఒక మంచి ఆదాయ మార్గాన్ని ఇచ్చే వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకొనుటకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.హెప్సిబా, జిల్లా లైవ్లీ హుడ్ స్పెషలిస్ట్ సీహెచ్ నానీబాబు, జిల్లా ఐబీ సీహెచ్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా చినమిల్లిపాడు రహదారి



ఆకివీడు: కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు గ్రామంలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

ఆకివీడు: కొల్లేరు తీర గ్రామమైన చినమిల్లిపాడు గ్రామం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. నడిచి వెళ్లడానికి వీలు లేకుండా రహదారి ఉంది. దుక్కి వర్షానికే గుంతలు గుంతలుగా మారి ప్రమాద భరితంగా ఉంది. అడుగు వేస్తే మడుగులోతులో కూరుకుపోయేటంతటి గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం కోసం రోడ్డు మార్జిన్లు వెడల్పు చేసి గ్రావెల్ వేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో తమ రోడ్డును పట్టించుకునే నాథుడులేడని వారు వాపోతున్నారు. రహదారి గుండా కొల్లేరు తీరంలోని చేపల చెరువులు, వ్యవసాయ భూములకు ప్రతి రోజూ అనేక మంది వాహనాలతోనూ, కాలినడకన వెళ్తుంటారు. చేపల చెరువులకు మేత తీసుకువెళ్లేందుకు వాహనాలు కూడా రాని పరిస్థితి ఏర్పడుతోందని వారు వాపోతున్నారు. రహదారి బురదమయంగా మారడంతో బురదనీరు తమ వాకిళ్లల్లోకి, గోడలపైకి పడటంతో బురదమయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు తమ గ్రామాన్ని పట్టించుకుని, రహదారి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

జాతీయ స్థాయిలో స్విమ్మింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు గెల్చుకున్నారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు చెప్పారు. విజేతలను మంగళవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా వివరాలను విలేకర్లకు వివరించారు. ఈనెల 12,13 తేదిల్లో మంగళగిరి టీఎంటీసీ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి జస్వంత్ 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా, బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె కార్తీక్, పి అభినవ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో తృతీయస్థానం సాధించారన్నారు. విజేతలు, వారిని ప్రోత్సహించిన కోచ్‌లు సీహెచ్‌ఎస్‌ఎస్ వర్మ, పి ఏడుకొండలును కళాశాల ప్రిన్సిపల్ ఎం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు అభినందించారు.

ఎక్కడి చెత్త అక్కడే

దుంపగడప గ్రామానికి వెళ్లే పంట నీటిలోకి చెత్తాచెదారం



స్థానిక అయిభీమవరం రోడ్డులోని దుంపగడప వెళ్లే ఛానల్ వద్ద డంపింగ్ దృశ్యం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని మంచినీటి చెరువులోకి వ్యర్థనీరు, వ్యర్థాలు వేస్తున్నారని గతంలో అయిభీమవరం రోడ్డులోని ఇళ్లను తొలగించారు. అయితే అదే కాలువలోకి వ్యర్థాలు, కుళ్లిన పదార్థాలు, దుర్వాసన వచ్చే పదార్థాలు కొచ్చుకువెళ్లే విధంగా కాలువ ముఖద్వారాన్ని డంపింగ్ చేశారు. అక్కడే చెత్త, వ్యర్థాలు వేయడంతో కుక్కలు, కాకులు వాటిని పీకివేసి కాలువలోకి నెట్టివేస్తున్నాయి. వర్షం వస్తే వ్యర్థాల్లోని దుర్గంధం అంతా పంట కాల్వలోకి వెళ్లి దుంపగడప వాసులకు కలుషిత నీరు చేరే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్లు లేకపోయినప్పటికీ కాలువ ముఖద్వారం ప్రాంతాన్ని డంపింగ్ ఎవరు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలలంక కాల్వ, గంగానమ్మకోడు డ్రెయిన్‌లను ఆక్రమించిన ఇళ్లను తొలగించి, ఈ ప్రాంతంలో మినీ లారీలు, వ్యాన్లు నిలుపుకునేందుకు అవకాశం కల్పించడంతో వాహనాల నుంచి వెలువడే ఆయిల్, ఇతర వ్యర్థాలు పంట కాల్వలోకి కొచ్చుకువెళ్తున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో వాహనాల నిలుపుదలను అరికట్టి, పార్కుగా తయారు చేయాలని పలువురు కోరుతున్నారు.

38వ వార్డులో పారిశుద్ధ్య పనుల పరిశీలన



38వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం 38వ వార్డులో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ అధికారులతో పట్టణంలోని 38వ వార్డులో రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో ఆకస్మికంగా పర్యటించారు. వార్డులోని పారిశుద్ధ్యం, వాటర్ సప్లై పనితీరును పరిశీలించారు. ప్రతిరోజు ఉదయాన్నే ఇంటింటికి వచ్చి మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నారా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున ఎక్కడపడితే అక్కడ నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. డ్రెయినేజీ ఎక్కడా కూడా చెత్త అడ్డు లేకుండా తొలగించాలని సూచించారు. వార్డులో అభివృద్ధి పనులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఏ రాంబాబు, ఏపీసీ లక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథ్‌రావు, టీపీఓ పార్థసారథి, శ్యానిటరీ ఇన్స్‌పెక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో పీఎంఏజీవై ఆదర్శ గ్రామాలకు సంబంధించి గ్రామ అభివృద్ధి ప్రణాళికను రూపొందించి పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనపై గ్రామాల అభివృద్ధికి ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత 11 గ్రామాలను, రెండో విడత 14 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేసి 11 గ్రామాలకు బడ్జెట్ కేటాయించడం జరిగిందని తెలిపారు. 11 గ్రామాల్లో పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. రెండు విడతలుగా ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామాభివృద్ధి ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి పనులను ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరి, డీపీఓ ఎం.రామ్నాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ జిలా ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఏ.సూరిబాబు, డీఈవో ఇ. నారాయణ, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ చర్చలు, కళారూపాలకు సాంస్కృతిక వేదికగా బుక్‌హౌస్

భీమవరం: సాహితీ చర్చలు, కళారూపాలకు సాంస్కృతిక వేదికగా బుక్ హౌస్‌లుండాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. మంగళవారం భీమవరం పట్టణంలోని సుందరయ్య భవనంలో కందుకూరి గురజాడ బుక్‌హౌస్‌ను శర్మ, ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ప్రారంభించి సందర్భంగా శర్మ మాట్లాడారు. నూతన ప్రపంచంలో పుస్తక అధ్యయనం ప్రాముఖ్యత కలిగిందని, పుస్తక పఠనం నూతన తరం అభివృద్ధికి, సమాజ మార్పునకు దోహదం చేస్తుందన్నారు. గోపీమూర్తి మాట్లాడుతూ భీమవరం లాంటి ప్రాంతంలో ఇప్పటివరకు ఇలాంటి బుక్ హౌస్ లేదని ఇప్పుడు బుక్‌హౌస్ నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ మంతెన సీతారాం, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి బలరామ్, డాక్టర్ పీఆర్‌కె వర్మ, ఎల్‌హెచ్ టౌన్ హాలు సెక్రటరీ బేతు కృష్ణారావు, బుక్ హౌస్ కన్వీనర్ జి.రామలింగరాజు, ఎస్ఆర్‌కెఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ మంతెన జగపతి రాజు, ఇందుకూరి ప్రసాదరాజు, సీఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ళ సత్యనారాయణ, సాగిరాజు సాయిరాజు, సాగిరాజు శ్రీనివాస్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకశాఖ అభివృద్ధిపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పర్యాటకం విస్తరించేలా మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బీచ్ రిసార్ట్స్‌కు మౌలిక వసతులు అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకం విస్తృతంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిలో భాగంగా సముద్ర తీర ప్రాంతాన్ని ఆనుకొని పర్యాటకం అభివృద్ధికి దోహదపడుతున్న రిసార్ట్స్‌కు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రిసార్ట్స్‌కు త్రీ ఫేజ్ విద్యుత్తు ఏర్పాటును 20 రోజుల లోపుగా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన మంచినీటి సౌకర్యం, తదితర వసతుల ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కనుమరుగవుతున్న సంప్రదాయ చేతి వృత్తులు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

భీమవరం: పాలకుల నిర్లక్ష్యం, కార్పొరేట్ మాయాజాలంతో కనుమరుగవుతున్న సంప్రదాయ చేతి వృత్తులను బతికించుకోవాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన విశ్వకర్మ, నేడు చంద్రబాబు నాయుడు నెలకొల్పిన కులవృత్తుల కార్పొరేషన్లు, అసలైన చేతివృత్తుల సాధికారతకు ఊతం ఇవ్వడం లేదని విమర్శించారు. సాంప్రదాయ చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి సబ్సిడీపై ముడిసరుకు, విద్యుత్ రాయితీలు, మార్కెటింగ్, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక పింఛన్లు అందజేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కుల వృత్తులను కార్పొరేట్‌బాబులు కులవృత్తులుగా మార్చుకోవడంతో అసలైన చేతివృత్తిదారులకు ఉపాధి లేకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం సీతారాంప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, జేగురు శ్రీనివాస్, పిసి జోషి, అరట్లకట్ల నాగేశ్వరరావు, తిరుమాని కామేశ్వరరావు, కోన గొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈకేవైసీ చేసుకున్న వారికే ఉపాధి పనులు



పెదఅమీరంలో ఈకేవైసీ నమోదు చేస్తున్న సిబ్బంది

కాళ్ల: మండలంలో ఈకేవైసి చేసుకున్న వారికి మాత్రమే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో కాళ్ల ఎంపీడీఓ జి.స్వాతి మంగళవారం తెలిపారు. ఉపాధి హామీ కార్మికులు ఫీల్డ్ అసిస్టెంట్లు ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో 11,792 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. అందులో 4854 (41.16%) జాబ్ కార్డులకు ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారు ఈ నెల 20వ లోగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. పెద అమీరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



బాణ సంచా విక్రయదారుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

భీమవరం: దీపావళి సందర్భంగా బాణ సంచా విక్రయాలకు తాత్కాలిక లైసెన్స్ పొందే వ్యాపారులు నిబంధనలు పాటించాలని ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భీమవరం అగ్నిమాపక కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భీమవరం ఆర్డీవో కె ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాణ సంచా విక్రయాల షాపుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకాధికారి బి శ్రీనివాసరావు, భీమవరం ఏడీఎఫ్‌వో కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త, తూడు తొలగించి వరిపంటను కాపాడండి



యండగండి మీడియం డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త, తూడు

ఉండి: మండలంలోని యండగండి మీడియం డ్రెయిన్, బొండాడ మేజర్ డ్రెయిన్‌ల్లో పేరుకుపోయిన చెత్త, తూడును వెంటనే తొలగించి వరిపంటను ముంపు నుంచి కాపాడాలని యండగండి నీటి సంఘ సభ్యుడు పీవీఎస్ గోపాల కృష్ణంరాజు డ్రెయినేజ్ డీఈ, ఉండి, గణపవరం ఏఈలకు ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. రెండు డ్రెయిన్‌ల్లో తూడు, చెత్త చెదారం కుప్పలుగా పేరుకుపోవడంతో భారీ వర్షాలకు వరిపంట ముంపుకు గురవుతుందని తెలిపారు. వర్షం తగ్గిపోయినా వరిచేలల్లోని నీరు బయటకు పోకపోవడంతో పంటకు పలు రకాల తెగుళ్లు సోకే అవకాశం ఉందని, అధికారులు వెంటనే చర్యలు చేపట్టి యండగండి మీడియం డ్రెయిన్‌లోను, బొండాడ మేజర్ డ్రెయిన్‌లోని అక్విడెక్టువద్ద, వాండ్రం వంతెన వద్ద ఇతర ప్రాంతాల్లోను పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు.

ఘనంగా తపాలా వారోత్సవాలు



స్టాంపులు నాణాల ప్రదర్శన దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్టాంపులు, నాణాలు సేకరించడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకుంటే పరిజ్ఞానం పెరుగుతుందని పలువురు వక్తలు తెలిపారు. భీమవరం పోస్టల్ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాల శాఖ వారోత్సవాల్లో భాగంగా స్టాంపులు, నాణాల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. హెడ్‌పోస్టుమాస్టర్ పి రాజు మాట్లాడుతూ తపాల శాఖ కేవలం ఉత్తరాలతోనే కాకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఏఎంసీ మాజీ చైర్మన్ కొళ్ల నాగేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో సూపర్ జీఎస్టీ బెనిఫిట్ బజార్

భీమవరం(ప్రకాశం చౌక్): అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుస్తున్న జీఎస్టీ ఫలాలను ప్రజలకు తెలియజేయాలని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ అన్నారు. జువ్వలపాలెం రోడ్డులోని కాస్మోపాలిటన్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన భీమవరం సూపర్ జీఎస్టీ బెనిఫిట్ బజార్‌ను రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం సందర్శించారు.